సాక్షి
అనకాపల్లి
శనివారం । 14 । డిసెంబర్ । 2024



సమస్యలు పట్టవా?

ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని యలమంచిలి మహాసభలో ఎస్ఎఫ్ఐ నేతలు మండిపడ్డారు. ర్యాలీతో విద్యార్థులు కదం తొక్కారు. IIలో



సారెతో కదిలిన నారి

యలమంచిలిలో కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. IIలో



ఆశ్రమ విద్యార్థిని మృతి

తాటిపర్తి ఆశ్రమ విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందింది. వార్డెన్, హెచ్ఎంల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు ఆరోపించారు. IIలో

న్యూస్‌రీల్

నేడు నీటి సంఘాలకు ఎన్నికలు



చోడవరంలో ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన సిబ్బంది

- జిల్లాలో 300 నీటి సంఘాలకు నిర్వహణ
- మొత్తం ఓటర్లు 2,75,266 మంది రైతులు

సాక్షి, అనకాపల్లి: సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 300 నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో తాండవ మేజర్ ప్రాజెక్టు పరిధిలో 16, మీడియం ప్రాజెక్టులైన రైవాడ, కోనాం, పెద్దేరు రిజర్వాయర్ల పరిధిలో 28 మీడియం, 256 మైనర్ నీటి సంఘాలున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరగనుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,060 ప్రాదేశిక నియోజక వర్గాలు ఉన్నాయి. ఎన్నికలకు 1,876 మంది పోలింగ్ స్టాఫ్ నిర్వహించనున్నారు. మొత్తం 2,75,266 మంది రైతులు తమ ఓటు వినియోగించుకోనున్నట్లు జిల్లా నీటి సంఘాల ఎన్నికల నోడల్ అధికారి ఏ త్రినాథం వెల్లడించారు.

ఏయూలో పాళి, బౌద్ధ అధ్యయనాలలో ఆన్‌లైన్ కోర్సు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాళి, బౌద్ధ అధ్యయనాలలో ఆన్‌లైన్ కోర్సును శుక్రవారం ప్రారంభించారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీ జయవర్ధనపుర విశ్వవిద్యాలయం, శ్రీలంక నుంచి వచ్చిన అధికారులు ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయవర్ధనపుర విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్, సీనియర్ ప్రొఫెసర్ పత్మలాల్ మానగే పాల్గొన్నారు. ఆయన ఆంధ్రా విశ్వవిద్యాలయం పాళి, బౌద్ధ అధ్యయనాల విభాగంలో సహకార ప్రోగ్రాంను పెంచడం కోసం చేసిన కృషిని అభినందించారు. రెండేళ్ల ప్రోగ్రాం ప్రాముఖ్యతను సమకాలీన సమాజానికి వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్ బాబు మాట్లాడారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

విశాఖ-లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో (శనివారం) డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతన్న గొంతుకై.. సమరశంఖమై..

అందరికీ అన్నం పెడుతున్న రైతుల పొట్టకొట్టింది కూటమి ప్రభుత్వం. ఆరుగాలం శ్రమిస్తున్న అన్నదాతకు 'భరోసా' కల్పిస్తూ అండగా నిలవాల్సిన సర్కారు.. అనాథగా వదిలేసింది. కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు సంతోషపడిన రైతు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వారి చేష్టలకు విసిగిపోయాడు. పొలంలో హలం పట్టాల్సిన కర్షకుడి కడుపుమండి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ప్లకార్డులు పట్టుకున్నాడు. కనీస మద్దతుధర కల్పించాలంటూ నినదించాడు.. పెట్టుబడి సాయం ఎక్కడంటూ ప్రశ్నించాడు. రోడ్డెక్కిన రైతన్నకు బాసటగా నిలుస్తూ.. 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' అడుగేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు రైతులతో కలిసి నిరసనకు నడుం బిగించింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన తొలిపోరుకు మంచి స్పందన లభించడంతో.. అధికార పార్టీ నేతల్లో అలజడి మొదలైంది.

- 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ'కి మంచి స్పందన
- కూటమి ప్రభుత్వ వైఖరిపై రైతులతో కలిసి నిరసన ప్రదర్శన
- ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హోరెత్తిన నినాదాలు
- ఆదుకోవాల్సిన ప్రభుత్వం మోసం చేస్తే సహించేది లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు హెచ్చరిక
- అనకాపల్లి రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ



అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, ముఖ్యనేతలు దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, గొర్లి సూరిబాబు, జానకీ రామరాజు

సాక్షి, అనకాపల్లి:

రైతు కన్నీరు రాష్ట్రానికి మంచిది కాదు.. అన్నదాత ఆనందంగా ఉంటేనే అందరికీ మేలు జరుగుతుంది.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చి మాట నిలుపుకోండి.. అని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో రైతులు నష్టాల్లో కూరుకుపోయారని, ఆదుకోవాల్సిన ప్రభుత్వమే మోసం చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. అన్నదాతకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ నిలుస్తుందన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఉద్యమబాట పట్టింది. అనకాపల్లి టౌన్‌లో రింగ్ రోడ్డు వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర భారీ బైక్ ర్యాలీ జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవికి బూడి ముత్యాలనాయుడు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, కన్నబాబురాజు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, మాజీ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ముఖ్యనేతలు చింతకాయల సన్యాసిపాత్రుడు, దంతులూరి దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు, మలసాల కుమార్‌రాజా, పైలా ప్రసాదరావు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు మందపాటి జానకీ రామరాజు, రుత్తల యర్రాపాత్రుడు, పెంటకోట స్వామి సత్యనారాయణ, జాజుల రమేష్, పీలా శ్యామ్, పెదిశెట్టి గోవింద్, దంతులూరి శ్రీధర్‌రాజు, శ్రీనివాసరావు, దూళి నాగరాజు, బోదిపు గోవింద్, గొట్టిముక్కల శ్రీనుబాబు, కలగ గున్నయ్యనాయుడు, పీడీ గాంధీ, దగ్గుపల్లి సాయిబాబా, జగత శ్రీనివాస్, రాజేష్ కన్నా, శీరం నరసింహమూర్తి, గొర్లి బాబురావు, లొడగల చంద్రరావు, ఏవీ రత్నకుమారి, సునీత, పద్మ, లాళం జానకీరామ్, కురస జయమ్మ, కురస నారాయణమూర్తి, సుంకర శ్రీనివాసరావు, గొల్లవిల్లి రాజుబాబు, గొల్లవిల్లి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వైఎస్సార్‌సీపీ నేతల వినతి పత్రం

యూరియా బ్లాక్‌లో కొన్నాం



ధాన్యం కొనుగోలు ప్రక్రియను దళారుల చేతులో పెట్టారు. ఈ ఏడాది యూరియా కూడా సరైన సమయంలో దొరకక.. బ్లాక్‌లో కొనుక్కొని పంటకు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– రాజేష్ కన్నా, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు

దిగులుగా ఉంది



కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తోంది. అయినప్పటికీ రైతు భరోసా ఇవ్వకపోవడం శోచనీయం. గత ఐదేళ్లు ఎంత నిశ్చింతగా బతికామో ఇప్పుడు అంత దిగులుగా ఉంది.

– నీటిపల్లి లక్ష్మి, తేగాడ గ్రామం, కొంకోట మండలం



వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, తదితర నేతలు

రైతులను కష్టపెట్టకండి



అన్నదాత సుఖీభవ పేరిట పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలను తక్షణమే చెల్లించాలి. ఉచిత పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వం భరించాలి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీని భరించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దళారీ వ్యవస్థను రద్దు చేసి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి. వర్షాల వల్ల తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతులను అన్ని విధాలా ఆదుకున్నాం. కానీ ప్రస్తుతం 20 రోజులుగా కోతలు కోసి నూర్చి ధాన్యం కల్లాల్లో ఉంటే ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టలేదు.

-బూడి ముత్యాలనాయుడు,
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

మోసాలు బాబుకు వెన్నతో పెట్టిన విద్య



రైతులను మోసగించడమంటే చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఖరీఫ్ పూర్తయింది.. రబీ సీజన్ కూడా ప్రారంభమైంది..ఇప్పటికీ పెట్టుబడి సాయమందలేదు. గోవాడ సుగర్స్ రైతులకు ఇవ్వాల్సిన రూ.11 కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలి.

-కరణం ధర్మశ్రీ,
చోడవరం సమన్వయకర్త

ఆర్బీకేలు నిర్వీర్యం



రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం చేసే విధంగా కూటమి ప్రభుత్వం తీరు ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుకు అందించిన మేలును ప్రతీ గ్రామంలో రైతులు తలుచుకుంటున్నారు. పంట బీమా కూడా రైతులే చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ దుస్థితి మారాలి.

-డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి,
మాజీ ఎంపీ


హామీలను గాలికొదిలేశారు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయమంటే ఒక పండగలా ఉండేది. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయమంటే వట్టి దండుగలా ఉంది. కూటమి ప్రభుత్వం మేము అమలు చేసిన పథకాలను నిర్వీర్యం చేసిందే కాకుండా.. ఇస్తామన్న హామీలను గాలికొదిలేసింది.

-అన్నంరెడ్డి అదీప్‌రాజ్,
పెందుర్తి సమన్వయకర్త

రైతులకు దగా



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్బీకేలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతు వద్దకే సబ్సిడీ పేరిట విత్తనాలు, ఎరువులు అందించారు. పెట్టుబడి సాయం, క్రాప్ ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కూటమి సర్కారు నైజం అర్థమైంది. దగా చేయడం బాబు నైజమని మరోసారి అవగతమయింది.

-కంబాల జోగులు,
పాయకరావుపేట సమన్వయకర్త

వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకుందాం

- అంగూర్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు శివనారాయణ
- ఆర్ఏఆర్ఎస్‌లో 65వ కిసాన్ మేళా
- వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 10 మందికి అవార్డులు



మాట్లాడుతున్న అంగూర్ విస్తరణ సంచాలకుడు శివనారాయణ

అనకాపల్లి: వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని, జిల్లాలో గత ఏడాది లక్ష హెక్టార్లలో చెరకు పంట వేశారని, ఈ ఏడాది 7 వేల హెక్టార్ల చెరకు పంట తగ్గిందని గుంటూరు అంగూర్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు జి.శివనారాయణ అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో 65వ కిసాన్ మేళా కార్యక్రమం శుక్రవారం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అన్ని శాఖలు సమష్టిగా పని చేయాలన్నారు. రానున్న రోజుల్లో రైతాంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా జిల్లాలో చెరకు పంట తగ్గిందని, జిల్లాలో ప్రస్తుతం ఒకే ఒక చెరకు ఫ్యాక్టరీ ఉండడంతో రైతులు చెరకు పంట కంటే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయం ఖర్చుతో కూడుకుందని, రైతులకు లాభసాటిగా లేకపోవడంతో వారు విముఖత చూపుతున్నారని అన్నారు. మన రాష్ట్రం జాతీయ స్థాయిలో పాలు, గుడ్లు, పశుసంపద, వరి వివిధ రకాల కూరగాయల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉందన్నారు. చెరకు పంటకు పూర్వ వైభవం కల్పించేందుకు ప్రయత్నించాలన్నారు. ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా మారేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో రైతులకు వరి, చెరకు, చిరుధాన్యాలపై దశల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు పంటలు వేసుకునే సమయంలో నేలసారాన్ని పరీక్షించి, అక్కడ ఏ పంట వేసుకుంటే లాభాలు ఆర్జించవచ్చో దానిపై దృష్టి సారించాలన్నారు. గత ఏడాది ఆర్ఏఆర్ఎస్ సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 10 మందిని అవార్డులతో సత్కరించారు. రైతులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కిసాన్ మేళాలో రైతులకు ఉపయోగపడే వివిధ స్టాళ్లను ఎమ్మెల్యే, విస్తరణ సంచాలకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, డి.ఆదిలక్ష్మి, కె. రమణమూర్తి, డి.ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రైతులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, ఏడీఆర్ ముకుందరావు



ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల చిరుధాన్యాలు

16న సింహగిరిపై నెలగంట





సింహాచలం: సింహగిరిపై ఈ నెల 16న నెలగంట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆ రోజు నుంచి నెల రోజులపాటు ధనుర్మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. సింహగిరిపై డిసెంబర్, వచ్చే ఏడాది జనవరిలో జరిగే విశేష ఉత్సవాలకు సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 16న ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ రోజు ఉదయం 6.35 గంటలకు సింహగిరిపై రాజగోపురంలో నెలగంట మోగిస్తారు. స్వామి, గోదాదేవికి విశేష పూజలు, తిరువీధి నిర్వహిస్తారు. నెలగంట సందర్భంగా ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి స్వామి దర్శనాలు ప్రారంభమవుతాయి.

31 నుంచి అధ్యయనోత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయి. ఈ నెల 31 నుంచి జనవరి 9 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం స్వామికి తిరువీధి ఉత్సవం(అయ్యవారి సేవ) జరుగుతుంది.

జనవరి 10 నుంచి 20వ తేదీ వరకు రాపత్తు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం 5 గంటలకు స్వామికి తిరువీధి జరుగుతుంది.

మీడియాపై దాడులు సరికావు



విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మీడియా ప్రతినిధులు

- వైఎస్సార్ కడప జిల్లాలో సాక్షి మీడియాపై కూటమి నేతలు దాడులు
- ఖండించిన మీడియా ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాలు

సీతమ్మధార : సాక్షి మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిని వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ కడప జిల్లా వేముల మండల కేంద్రంలో నీటిసంఘాల ఎన్నికల ప్రక్రియ కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిలపై రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని విశాఖ సాక్షి దినపత్రిక ప్రతినిధులు,పలు సంఘాల నాయకులు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ పి.వేణుగోపాల్ మాట్లాడుతూ సాక్షి ప్రతినిధులపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా సహాయకార్యదర్శి కేటీ రామునాయుడు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకతను తెలియపరిస్తే కూటమి ప్రభుత్వం సహించలేకపోతోందని మండిపడ్డారు. సాక్షి డెస్క్ ఇన్‌చార్జి బీబీ సాగర్ మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచే మీడియా గొంతునొక్కాలన్న ప్రభుత్వ విధానాలను అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. వైజా గ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ కార్యదర్శి నవాజ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి చేయడం ద్వారా మీడియా గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. ఊశారు. ఈ కార్యక్రమంలో విశాఖ సాక్షి బ్యూరో చీఫ్ కేజీ రాఘవేంద్రరెడ్డి, స్టాఫ్ రిపోర్టర్లు, డెస్క్ సభ్యులు, పలువురు విలేకరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

16న మెగా జాబ్ మేళా

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ వి.అప్పలనాయుడులు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మేళాలో ఎస్‌కేఎల్ అసోసియేట్స్, క్రెడిట్ ఆసిస్ గ్రామీణ్ బ్యాంకు లిమిటెడ్, దయాకిన్ ఎయిర్ కండిషనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సమీప ప్రాంతాల్లోని తగిన అర్హతలు, ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. పూర్తి సమాచారం కోసం స్కిల్ హబ్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్‌ను 94947 91935 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు పట్టివేత


అటవీ అధికారులు సీజ్ చేసిన కలప వ్యాన్

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం వద్ద శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న టేకు కలప వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. నర్సీపట్నం రేంజర్ అందించిన వివరాల ప్రకారం.. కొండల అగ్రహారానికి చెందిన రైతు సుర్ల గౌరీశంకర్ తన సొంత వ్యవసాయ భూమిలో టేకు చెట్లను నరికి కటింగ్ నిమిత్తం మాకవరపాలెంలోని సామిల్లుకు తీసుకెళ్తున్నారు. ఈ తరలింపునకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవు. దీనిపై ముందస్తు సమాచారం మేరకు మాకవరపాలెం పోలీసులు వ్యాన్‌ను అదుపులోకి తీసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. రూ.36 వేలు విలువ చేసే 26 టేకు దుంగలతో కూడిన వ్యాన్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనర్సు తెలిపారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక రేపు

ఎంవీపీకాలనీ: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 15న జరగనుంది. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏయూలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్ దరి ఓపెన్ గ్రౌండ్‌లో ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిక పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు ఈ నెల 22 నుంచి 25 తేదీ వరకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో జరగనున్న 50వ రాష్ట్ర జూనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని చెప్పారు. 2005 జనవరి 12 తర్వాత జన్మించిన 70 కిలోల లోపు బరువున్న పురుషులు, 65 కిలోల లోపు బరువున్న మహిళలు ఈ ఎంపికకు అర్హులని తెలిపారు.

సాగునీటి ఎన్నికలు.. ప్రభుత్వానికి రూ.కోట్లు

- నీటి తీరువా వసూలుతో ఆదాయం
- పన్నుతోపాటు 6 శాతం వడ్డీ విధింపు
- ఏకగ్రీవమైనా 2,060 మంది రైతులకు పన్ను
- ఒక్కో రైతుకు రూ. 20 వేల నుంచి రూ.40 వేల పన్ను బకాయి
- చెల్లించకుంటే పోటీకి అనర్హులు


ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ ఇస్తున్న తాండవ ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్

నాతవరం: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణతో రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరనుంది. తాజాగా జారీ చేసిన ఎన్నికల నియమావళి ప్రకారం పోటీ చేసే రైతులంతా 2010 నుంచి నేటి వరకు నీటితీరువా చెల్లించాల్సి ఉంది. వీరు 2009 వరకు మాత్రమే నీటి తీరువా చెల్లించారు. ఇప్పుడు పన్ను చెల్లించకుండా నామినేషను దాఖలు చేస్తే తిరస్కారానికి గురవుతారు. వారికి ఉన్న సాగు భూమిని బట్టి పన్ను విధిగా చెల్లించాలి. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల కింద భూమికి ఎకరానికి ఏడాదికి రూ.200 చెల్లించాలి. చిన్నతరహా ఆయకట్టు భూమికి ఏడాదికి రూ.100 చెల్లించాలి. రైతులు భూమికి చెల్లించే అసలు పన్నుకు 6 శాతం వడ్డీ కలిపి మొత్తం 15 ఏళ్లకు కట్టాలి.

మూడు మినహా మిగతా వాటికి ఎన్నికలు...

జిల్లాలో భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు 303 ఉండగా, వాటిలో మూడింటికి ఎన్నికలు జరగడం లేదు. మాకవరపాలెం మండలంలో రెండు చెరువులు అన్‌రాక్ కంపెనీలో కలిసిపోవడంతో అక్కడ భూముల రైతులు లేరు. రెవెన్యూ రికార్డులో మాత్రమే చిన్న తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. రావికమతం మండలం మేడిచర్ల చిన్న తరహా ప్రాజెక్టు మధ్య తరహా ప్రాజెక్టులోకి కలిసిపోవడంతో అక్కడ ఎన్నికలు లేవు. ఈ నెల 14న జిల్లాలో 300 మేజరు, మీడియం, మైనర్ ప్రాజెక్టులకు మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం 2,060 ప్రాదేశిక సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

జిల్లా నుంచి రూ.25 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు ఆదాయం....

ఎన్నికల్లో పోటీ చేసినా ఏకగ్రీవమైనా కచ్చితంగా నీటి తీరువా చెల్లించాలి. ఈ ఎన్నికల్లో అధికంగా భూములు ఉన్న పెద్ద రైతులు మాత్రమే పోటీ చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేజరు ప్రాజెక్టు పరిధిలో ఒక రైతుకు ఐదెకరాలు ఉంటే 15 ఏళ్లకు సంబంధించి పన్ను రూ.17 వేలకు పైగా చెల్లించాలి. అంటే సరాసరి ఎన్నికల్లో పోటీ చేసే రైతు ఒక్కంటికి భూమిని బట్టి తక్కువలో రూ.20 వేలకు పైగా పన్ను చెల్లించాలి. మొత్తం 2,060 ప్రాదేశిక సభ్యులు రెండు పార్టీల నుంచి ఇద్దరేసి పోటీ చేస్తే కనీసం 4,120 మంది రంగంలో ఉంటారు. వారికి ఇద్దరేసి చొప్పున ప్రతిపాదించాలి. వారు కూడా నీటి తీరువా బకాయి చెల్లించాల్సి ఉంటుంది. ఆ లెక్కన అనకాపల్లి జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.25 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉంది.

నిధులు ఇవ్వకుండా ఎన్నికల నిర్వహణ

ఎన్నికలు నిర్వహించేందుకు ముందుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఇంతవరకు ఒక్క పైసా ఇవ్వకపోవడంతో అధికారులు అప్పులు చేసి ఎన్నికల సామగ్రి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు 668 గెజిటెడ్ అధికారులు, 1,530 మంది ఇతర సిబ్బందిని నియమించారు. వీరికి ఎన్నికల నిర్వహణకు అదనపు అలవెన్సు ఇస్తారు లేదో తెలియని పరిస్థితి ఉందని ఒక జిల్లా అధికారి వాపోయారు.

ఏకగ్రీవమైనా పన్ను కట్టాలి



నీటి సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవమైనా పోటీ చేసే అభ్యర్థి ముందుగా తన భూమికి నీటి తీరువా అసలుకు 6 శాతం వడ్డీతో చెల్లించాలి. లేకపోతే నామినేషను తీసుకోవడం జరగదు. ఆ విషయాన్ని ముందుగా తెలియజేశాం. జిల్లాలోనే తాండవ రిజర్వాయరు మేజరు ప్రాజెక్టు, ఇక్కడ ఎకరానికి రూ.200 పన్ను చెల్లించాలి.

– ఎ.వేణుగోపాల్, తహసీల్దార్, నాతవరం మండలం

సారెతో కదిలిన నారి


కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపులో పిండి వంటలు,పండ్లు తీసుకెళ్తున్న మహిళలు

- కనకమ్మకు భారీ సారె సమర్పణ
- మేళతాళాల మధ్య యలమంచిలిలో ఊరేగింపు

యలమంచిలి రూరల్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం యలమంచిలి పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు వివిధ రకాల మిఠాయిలు, పండ్లు తలపై పెట్టుకుని ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, కోలాటం ప్రదర్శన మధ్య ఉత్సవ విగ్రహంతో స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి సీపీ పేట, సైతారుపేట రోడ్డు, ధర్మవరం, క్లబ్ రోడ్డు, ప్రధాన రహదారి, పాత ప్రభుత్వాస్పత్రి వీధుల మీదుగా ఊరేగింపు సాగింది. సారె ఊరేగింపును పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఊరేగింపు అనంతరం అమ్మవారి ఆలయం వద్ద 2 వేల మందికి అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొటారు సాంబ, తాటిపాకల చిన్ని, తాటిపాకల మాణిక్యాలరావు, కొటారు కొండబాబు, మడగల సత్యనారాయణ, మడగల బాబూరావు, మజ్జి కనక, వి.గణపతి, కొటారు సూర్య ప్రకాష్, కసిరెడ్డి నాగు, కొటారు అచ్చియ్యనాయుడు, పిల్లా నాగు, మహిళలు పాల్గొన్నారు.

కూటమి కుట్రలు పటాపంచలు

- ఎట్టకేలకు రైతులకు నీటి తీరువా రశీదులు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆందోళన
- దిగివచ్చిన రెవెన్యూ యంత్రాంగం


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నీటితీరువా కట్టించుకుని రైతులకు రశీదు ఇస్తున్న గొడిచర్ల వీఆర్వో నూకరాజు

నక్కపల్లి: నీటి సంఘాల ఎన్నికలను దొడ్డిదారిని నిర్వహించి ప్రతిపక్ష పార్టీల నుంచి పోటీ లేకుండా చేయాలని ప్రయత్నించిన కూటమి నాయకుల కుట్రలు పటా పంచలయ్యాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు నీటి తీరువా కట్టించుకోకుండా తప్పించుకు తిరుగుతున్న వీఆర్వోలు ఎట్టకేలకు దిగొచ్చారు. రైతుల నుంచి పన్ను కట్టించుకుని రశీదులు అందజేశారు. ఎన్నికల్లో అనర్హత వేటుకు కూటమి కుయుక్తులు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం వెలువడింది. దీనికి తోడు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో రెవెన్యూ యంత్రాంగం దిగి వచ్చింది. మండలంలో జరిగే నీటి సంఘాల ఎన్నికల్లో డైరెక్టర్లుగా పోటీ చేసే రైతుల నుంచి నీటి తీరువా కట్టించుకోకుండా కూటమి నాయకులు రెవెన్యూ యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చారు. గత నాలుగు రోజుల నుంచి వీఆర్వోలు ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో అందుబాటులో ఉండకుండా పావులు కదిపారు. తహసీల్దార్ కూడా తనకేమీ సంబంధం లేదని, నీటి తీరువా వసూలు చేసే బాధ్యత వీఆర్వోలదేనని చేతులెత్తేశారు. ప్రధానంగా గొడిచర్ల, ఉద్దండపురంలో 200 ఎకరాల ఆయకట్టుపైబడి ఉన్న చెరువుల ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ మూడు చెరువుల్లో ఆయకట్టు రైతుల్లో ఎక్కువ మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే ఉన్నారు. ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేక కొంత మంది కూటమి నాయకులు రెవెన్యూ యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చారు. డైరెక్టర్లుగా పోటీచేసే రైతుల నీటితీరువా కట్టించుకోకుండా పావులు కదిపారు. రైతులు నీటి తీరువా చెల్లిస్తామని రశీదులు ఇవ్వాలని కోరినప్పటికీ సదరు వీఆర్వోల నుంచి స్పందన లేదు. దీంతో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీటీసీ సభ్యుడు బచ్చలరాజు, నిట్ల గోవిందు, సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు తదితర రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తమ రైతులకు రశీదులు ఇచ్చే వరకు కదిలేది లేదని భీష్మించారు. దీంతో అధికారులు దిగివచ్చారు. వీఆర్వోలు వచ్చి రైతుల నుంచి నీటితీరువా వసూలు చేసి రశీదులు అందజేశారు.

ఆరు నెలలైనా సమస్యలు పట్టవా?



సమస్యల పరిష్కారం కోసం పట్టణంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

- ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి
- మహాసభలో మండిపడ్డ ఎస్ఎఫ్ఐ నేతలు
- ర్యాలీతో కదం తొక్కిన విద్యార్థులు

యలమంచిలి రూరల్: అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా విద్యార్థుల సమస్యలు మీకు కనిపించడం లేదా? అని కూటమి ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ నేతలు ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థులకు మంచి జరుగుతుందని భావించి.. ఓట్లేసి గెలిపించామని, చంద్రబాబు ముఖ్యమంత్రి, పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి, పలువురు పార్టీల నాయకులు మంత్రులు అయ్యారు తప్ప జనానికి, విద్యార్థులకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ 3వ జిల్లా సభలు యలమంచిలి పట్టణంలో జరిగాయి. ముందుగా స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి పాత సినిమా హాలు వరకు వివిధ కళాశాలలకు చెందిన ఇంటర్, డిగ్రీ విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి, వసతి గృహాల్లో మెస్ చార్జీలు పెంచాలి.. అంటూ అధిక సంఖ్యలో విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం పాత సినిమా హాలు వద్ద జరిగిన బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యలమంచిలిలో విద్యార్థులకు అందుబాటులో ఉండే స్టూడెంట్ బస్ పాస్ కౌంటర్ అనకాపల్లికి తరలిపోయిందన్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ధ్వజమెత్తారు. జైళ్లలో ఉంచుతున్న నేరస్థులకు ఆహారం పెట్టడానికి రోజుకు రూ.80 కేటాయిస్తుండగా.. హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థులకు మాత్రం రోజుకు రూ.50 మాత్రమే చెల్లిస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ ఆరోపించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలను నెలకు రూ.3000కు పెంచాలన్నారు. నక్కపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో అనేక హామీలిచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక విద్యార్థుల సమస్యల్ని మర్చిపోయి అందరినీ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. ఇటీవల కలెక్టర్ల సమావేశం పెట్టిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తమ 6 నెలల పాలన బాగుందంటూ వాళ్లకి వాళ్లే గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 7న ప్రభుత్వ స్కూళ్లలో నిర్వహించిన మెగా తల్లిదండ్రుల సమావేశంలో తల్లిదండ్రులు, విద్యార్థులను ప్రేక్షకులుగా కూర్చోబెట్టి నాయకులు ప్రసంగించారే తప్ప ఆయా స్కూళ్లలో సమస్యలపై చర్చించిన దాఖలాలు లేవన్నారు. నిరంకుశ విధానాలు విడనాడకపోతే ఏదో ఒక రోజు శ్రీలంక, బంగ్లాదేశ్ పరిస్థితులు రాకతప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమణ, జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మైలపల్లి బాలాజీ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, యలమంచిలి డివిజన్ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి మణికంఠ, సోమునాయుడు, బాలాజీ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్


మద్యం సీసాలతో పట్టుబడిన యువకుడు

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాపు ద్వారా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న వ్యక్తిని శుక్రవారం చోడవరం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కొట్యాడ నరసింహమూర్తి తన పాన్‌షాపులో మద్యం అమ్మకాలు చేస్తుండగా పట్టుకున్నట్లు చోడవరం ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ అప్పారావు తెలిపారు. ఆయన నుంచి 15 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యంతో పట్టుబడ్డ నరసింహమూర్తిపై కేసు నమోదు చేసినట్లు అప్పారావు తెలిపారు.

తాటిపర్తి ఆశ్రమ విద్యార్థిని మృతి

- వార్డెన్, హెచ్‌ఎంల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- ఆరోగ్యం బాగోలేదని ముందుగా సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం
- పాఠశాల ఎదుట బంధువులతో కలసి ఆందోళన


మృతి చెందిన విద్యార్థిని సత్యవతి, మృతురాలి తల్లిదండ్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రమాదేవి

మాడుగుల: తాటిపర్తి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని అనారోగ్యంతో చోడవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. తమ కుమార్తె అనారోగ్యం విషయాన్ని ముందుగా తెలియజేయలేదని, ఆమె మృతికి వార్డెన్, హెచ్‌ఎం కారణమంటూ బంధువులతో కలిసి బాధిత తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో డీఎస్పీ శ్రావణి, ఐటీడీఏ డీడీ ఎల్.రజని, తహసీల్దార్ రమాదేవి, స్థానిక పోలీసులు రంగంలోకి దిగి వివాదం సద్దుమణిగేలా చేశారు. బాధిత తల్లిదండ్రులు పెంటన్నదొర, సన్యాసమ్మ, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అయినాడ పంచాయతీ చీమలాపల్లి గ్రామానికి చెందిన ముర్ల సత్యవతి(14) మాడుగుల మండలం తాటిపర్తి గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమెకు ఆరోగ్యం బాగా లేదని గురువారం ఉదయం హాస్టల్ నుంచి ఫోన్ వచ్చిందని తండ్రి దొర తెలిపారు. వెంటనే ఆయన హాస్టల్‌కు వెళ్లి సత్యవతితో మాట్లాడగా కాలు నొప్పి ఎక్కువగా ఉందని చెప్పడంతో చోడవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సత్యవతి మృతి చెందింది. తమ కుమార్తె అనారోగ్యం విషయాన్ని వార్డెన్ మహేశ్వరి, హెచ్‌ఎం ఎస్.రమాదేవి ముందుగా సమాచారం ఇవ్వకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తల్లిదండ్రులు ఆరోపించారు. అనంతరం సీపీఎం నాయకులు ఇరటా నరసింహమూర్తి, కార్లి భవాని, బాధిత తల్లిదండ్రులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాఠశాల ఎదుట సత్యవతి మృతదేహంతో ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, ఐటీడీఏ డీడీ ఎల్.రజని, చోడవరం ఇన్‌చార్జి సీఐ కె.అప్పలరాజు, స్థానిక తహసీల్దార్ రమాదేవి, ఎంఈవో బి.దేముడమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ విషయమై, హెచ్‌ఎం రమాదేవి, వార్డెన్ మహేశ్వరిని సంప్రదించగా.. సత్యవతి పాఠశాలలో చాలా చురుకుగా ఉండేదని, బుధవారం తెలుగు పరీక్ష కూడా రాసిందని, గురువారం కాలు నొప్పిగా ఉందని తమకు చెందన్నారు. వెంటనే సచివాలయం ఏఎన్‌ఎం దగ్గరికి పంపించగా.. అక్కడ నొప్పికి సంబంధించిన ఇంజక్షన్ వేశారని, కొద్దిగా నొప్పి తగ్గడంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. బాగా చదువుతున్న విద్యార్థిని మృతి చెందడం తమకు కూడా బాధగా ఉందని, ఆమె ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని వారు స్పష్టం చేశారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి



అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక రైల్వే ట్రాక్‌పై సుమారు 35–40 సంవత్సరాల వ్యక్తిని గుర్తు తెలియని రైలు ఢీకొనడంలో అక్కడికక్కడే అతను మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి శుక్రవారం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382058996 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

గేదె పొడిచి మహిళ మృతి


మృతురాలు టేకు రాజేశ్వరి (ఫైల్)

ఎస్.రాయవరం: పాడి గేదె పొడవడంతో ఓ మహిళ మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. కర్రివానిపాలెం గ్రామానికి చెందిన టేకు రాజేశ్వరి (43) పొలంలో గేదెల మకాం వద్ద శుక్రవారం సాయంత్రం గేదెను కడుతున్న సమయంలో పొడవడంతో ఆమె తీవ్రగా గాయపడింది. వెంటనే ఆమె కుమారుడు మణికంఠ నక్కపల్లి ఆస్పత్రికి తీసుకుని బయలుదేరాడు. అయితేఈ మార్గమధ్యలో ఆమె మృతి చెందినట్టు చెప్పారు. వివరాల మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం


ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం పులుపు డ్రమ్ములు

కె.కోటపాడు: గవరపాలెం గ్రామ శివార్లలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం పులుపును శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారంతో గవరపాలెం శివారు చెరువు ప్రాంతంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ అప్పారావు సిబ్బందితో కలిసి తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా డ్రమ్ముల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పులుపును గుర్తించి ధ్వంసం చేశారు. నాటుసారా తాగడం వల్ల తీవ్ర అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని హెడ్ కానిస్టేబుల్ అప్పారావు తెలిపారు. చట్టవ్యతిరేకంగా నాటుసారా తయారీకి పాల్పడే వారు పట్టుబడితే కఠిన శిక్షలు అమలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఏయూలో 'టెక్సాస్' వర్సిటీ ఆచార్యులు

- విద్యా రంగంలో సహకారంపై చర్చలు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను అమెరికాలోని టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ ఆచార్యులు సందర్శించారు. గ్రాడ్యుయేట్ స్టడీస్ విభాగం డీన్ టింగ్, పబ్లిక్ హెల్త్ విభాగం ప్రొఫెసర్ విజయ్ గొల్ల శుక్రవారం ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, కంప్యూటర్ సైన్స్, విద్యా విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సంయుక్తంగా పనిచేసే అంశాలపై, అంటే కోర్సుల నిర్వహణ, పరిశోధన రంగం మొదలైన వాటిపై ప్రాథమిక చర్చలు జరిపారు. విద్యా విభాగంలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య టింగ్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించడానికి రావాలని ఏయూ విద్యార్థులను ఆహ్వానించారు. ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని తెలిపారు. ఏయూతో కలిసి పనిచేయడానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఆటిజం సమస్యను పరిష్కరించేందుకు ఏఐ, ఎంఎల్ సాంకేతికతలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ఎంఈడీ, బీఈడీ కోర్సులతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమెరికా ఆచార్యులను సత్కరించారు. రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ కె.బసవయ్య, విభాగాచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



హెల్మెట్ ధారణపై అవగాహన కలిగిస్తూ పోలీసుల బైక్ ర్యాలీ

కశింకోట: పోలీసులు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కలిగిస్తూ కశింకోటలో మోటారు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ ప్రాణాపాయం, ప్రమాదాల నుంచి రక్షణగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పోలీసు సిబ్బంది, వాహన చోదకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల విధానం రద్దు చేయాలి



పార్కు సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

అనకాపల్లి: కూటమి అధికారం చేపట్టిన తర్వాత దశలు వారీగా బడుగు, బలహీన వర్గాల ప్రజలపై విద్యుత్ శాఖలో ట్రూఅప్ చార్జీలను వేయడం మానుకోవాలని, ప్రతి గృహానికి స్మార్ట్ మీటర్లు బిగించకూడదని, బిగించిన వాటిని తక్షణమే తొలగించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కాళ్ల తేలయ్యబాబు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రతి ఒక్కరూ గతంలో వాడిన కరెంట్‌కు ఎంత బిల్ వచ్చిందో అంతకంటే ఎక్కువ రీచార్జి చేయించుకోవాలన్నారు. వాడబోతున్న కరెంట్ బిల్ కంటే ఎక్కువగా కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే అప్పటి టీడీపీ నేతలు స్మార్ట్‌మీటర్ల తిరస్కరించాలని చెప్పి, ఇప్పుడు అధికారంలో వాటిని బిగించాలని చెప్పడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి రామకృష్ణ, నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, డి.శివరాం, ఎ.జి.రామకృష్ణ, పెంటకోట సూర్య అప్పారావు, బొడ్డేడ వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 3,099బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	5,250
మొదటి రకం	3,500	4.170
రెండో రకం	3,090	3,780
మూడోరకం	2,980	3,200

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సన్ని	: పర్లిసాయి
మిస్‌యూ	: షిర్డీసాయి
జీబ్రా	: వెంకటేశ్వర
ప్రణయ గోదావరి	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 339 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 284 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

పంటల బీమా భారం రైతులపైనే...



వరి పంట

- వైఎస్సార్‌సీపీ హయాంలో ఉచితంగా అమలు
- తొలగించేసిన కూటమి ప్రభుత్వం
- రైతుల నుంచే ప్రీమియం వసూలు
- ఈ నెల 15తో ముగుస్తున్న గడువు

తుమ్మపాల: ఎన్నికల **సమయం**లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పెట్టుబడి సాయం చేయకుండా **చేతు**లెత్తేసింది. అంతేకాకుండా **రైతుపై అదనం**గా బీమా ప్రీమియం భారం మోపింది. బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని చెప్పడంతో అన్న**దాత పరిస్థితి** అగమ్యగోచరంగా **మారింది**. గత వైఎస్సార్‌సీపీ **ప్రభు**త్వం ఒక్క రూపాయి **ఖర్చు** లేకుండా ఉచిత పం**ట**ల బీమా అమలు చేసి, **పరి**హారం కూడా అందిం**చి**ందని రైతులు గుర్తుచే**సు**కుంటున్నారు. కూటమి **ప్రభు**త్వం దగా చేసిందని **మండి**పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుకు ఉచిత బీమా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. రైతు భరోసా కింద ఏటా రూ.13,500 బ్యాంకు అకౌంట్లో జమ చేసింది. అంతేకాకుండా బీమా ప్రీమియం రైతు వాటా చెల్లించి తోడుగా నిలిచింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే అదే సీజన్లోనే రైతుకు పరిహారాన్ని అందించి ఆదుకుంది. వ్యవసాయాన్ని పండగలా మార్చింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులను నియమించి బాసటగా నిలిచింది.

ఆందోళనలో రైతులు...

మండలంలో 6,500 ఎకరాల మేర రైతులు వరి పంట సాగుచేస్తున్నారు. దీంతో పాటు పలు రకాల మైరు పంటలైన మినప, పెసలు వగైరా సాగు చేస్తున్న రైతులు ఐదు వేల ఎకరాల మేర ఉన్నారు. వీరంతా ఈ నెల 15 లోపున ప్రీమియం చెల్లించాల్సి ఉంది. వీరిలో అధిక శాతం రైతులు పంటలు పడించేందుకు బోర్లుపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందస్తామని హామీ ఇచ్చి కూటమి పార్టీ అధికారంలోకి వచ్చింది. ఖరీఫ్, రబీ సీజన్ పూర్తవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం చేయలేదు. దీనికి తోడు ఉచిత బీమా పథకానికి కూడా మంగళం పాడారు. బీమా పరిహారం కావాలంటే ప్రీమియం రైతే చెల్లించుకోవాలని చెప్పడంతో వ్యవసాయం భారంగా మారింది. రైతులు పండించిన పంటకు చీడపీడ, తెగుళ్లు అధికమయ్యాయి. పంట అమ్ముకోవాలంటే గిట్టుబాటు ధర లేక రైతులు దిగులు చెందుతున్నారు.

రైతులు చెల్లించాల్సిన బీమా వివరాలు...

పంట	బీమా ప్రీమియం (ఎకరాకు)
వరి	రూ.630
పెసలు	రూ.300
మినుములు	రూ.300

ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి



రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సంబంధించి ఏ పథకం సక్రమంగా అమలు కాలేదు. పెట్టుబడి సాయం అందక సాగు కష్టంగా మారింది. వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయాం. బీమా ప్రీమియం చెల్లింపు భారంగా మారింది. బీమా ప్రీమియం రైతుల వాటాను ప్రభుత్వమే చెల్లించాలి. పండించిన దిగుబడులకు గిట్టుబాటు కల్పించాలి.

– జి.రాము, శంకరం, రైతు, అనకాపల్లి

రైతులపై భారం తగదు



కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసి అండగా ఉంటుందనుకున్నాం. అందుకు విరుద్ధంగా ప్రస్తుత పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలు అందజేస్తామని టీడీపీ కూటమి నేతలు ఇచ్చిన హామీని విస్మరించారు. పెట్టుబడి సాయం ఊసే ఎత్తడం లేదు. రైతుల సమస్యలను పట్టించుకోని కూటమి సర్కార్ బీమా ప్రీమియం రైతులే చెల్లించుకోవాలనడం చాలా బాధాకరం.

– పి.శేఖర్, రైతు, రేబాక, అనకాపల్లి మండలం

రైతులే ప్రీమియం చెల్లించాలి

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకుని రైతులే పంట బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించకుంటే నష్టపరిహారం రాదు. బీమా వర్తింపునకు రైతులు ఈ నెల 15వ తేదీలోపు పంట నమోదు, బీమా ప్రీమియం చెల్లించాలి.

– పి.రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

రెవెన్యూ సదస్సులకు 28 అర్జీలు



రెవెన్యూ సభలో తహసీల్దార్ శ్రీనివాసరావు

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం, గొబ్బూరు పాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 28 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతుల నుంచి రీసర్వే, పాసు పుస్తకాలలో సవరణల కోసం అర్జీలను రైతులు అందజేశారు. రెవెన్యూ సిబ్బంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

'సినిమా పిచ్చోడు' చిత్ర యూనిట్ సందడి

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఎన్నేటి కుమారస్వామి నటిస్తూ, దర్శకత్వం వహించిన 'సినిమా పిచ్చోడు' చిత్ర యూనిట్ శుక్రవారం దేవరాపల్లిలో సందడి చేసింది. స్థానిక మహేశ్వరీ థియేటర్‌లో ప్రదర్శించిన ఈ చిత్రాన్ని స్థానికులు, చిత్ర యూనిట్‌తో కలిసి కుమారస్వామి తిలకించారు. అనంతరం థియేటర్ ప్రాంగణంలో యూనిట్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సందడి చేశారు. అనంతరం స్థానికుడైన హీరో కుమారస్వామిని థియేటర్ యజమాని ఎల్లేటి కరుణాకర్‌రావు తదితరులు ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు సినీ పరిశ్రమలో రాణించడం గర్వకారణమని ప్రశంసించారు. నటుడు కుమారస్వామిని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, కిల్లి గోవింద, గొర్లి దేముళ్లు, దుక్క సత్తిబాబు, తదితరులు సత్కరించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

అనకాపల్లి: నియోజకవర్గంలోని 17 సాగునీటి సంఘాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. తగరంపూడి, సీతానగరం, తుమ్మపాల చెరువు, చెర్లోపల్లి, ఎల్లయ్య కాలువ, పులి కాలువ, వీరన్న కాలువ, కేశవ నాయుడు చెరువు, పోతుకొండ గెడ్డ, ధర్మసాగరం, కనుమాల, యర్రనాయుడు, ఎరకన్న దొర, ఊర చెరువులు, నరసింహసాగర్ కాలువ, కాశీ బంధ కాలువ సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 10,998 మంది రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సంఘాల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు.

కశింకోట: మండలంలో ఆరు సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. కశింకోటలోని కాశీమదుం, వెదురుపర్తి, పేరంటాలపాలెం, ఉగ్గినపాలెం, నరసాపురం, బయ్యవరం సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. చేతులెత్తే విధానంలో ఎన్నికలు జరుగుతాయన్నారు.

వృద్ధులకు సైబర్ నేరాలపై అవగాహన



వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న అల్లు కృష్ణారావు

అనకాపల్లి: వృద్ధులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకోవడం వల్ల వారిలో సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గానికి చర్యలు తీసుకోవాలని హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ అల్లు కృష్ణారావు తెలిపారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో హెల్ప్ ఏజ్ ఇండియా, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ నేరాలపై డిజిటల్ బోర్డుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైన వ్యక్తి గంటలోపు దగ్గరలో పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడం వల్ల పోగొట్టుకున్న నగదును తిరిగి తీసుకునివస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.గౌరీపతి, సభ్యులు ఎం.బి.బి. స్వామి, తమ్మిరాజు, విల్లూరి సత్యనారాయణ, పి.వి.సబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలని వినతి



ఎమ్మెల్యే రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న దేవీనగర్ కాలనీ వాసులు

అనకాపల్లి: మండలంలో కొత్తూరు పంచాయతీ పరిధి దేవీనగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని కాలనీ వాసులు శుక్రవారం స్థానిక రింగ్ రోడ్డు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో 80 కుటుంబాలు 30 సంవత్సరాలుగా జీవిస్తున్నాయని, డ్రైనేజీ వ్యవస్థ లేకుండా పోయిందని వాపోయారు. రహదారులు శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాలుపడే సమయంలో సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలో దొంగగెడ్డ ద్వారా వర్షపునీరు గృహాల్లోకి చేరుతుందని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాజారావు, రామారావు, వినయ్, సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కిసాన్ మేళా



కిసాన్ మేళాలో గడ్డి కోసే యంత్రాల ప్రదర్శన



రైతు ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో 65వ కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు అధ్యక్షతన వివిధ వ్యవసాయ స్టాళ్లను ప్రదర్శించారు. ఇవి సందర్శకులను మంత్రముగ్ధుల్ని చేశాయి.

– అనకాపల్లి



వివిధ రకాల రాగి కంకులు



వ్యవసాయ యంత్రాలు, పరికరాల ప్రదర్శన

దళిత వాడల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలి



డీఎస్పీ శ్రావణికి వినతిపత్రం అందజేస్తున్న రేబాక మధుబాబు

అనకాపల్లి: దళితవాడల్లో రాత్రిళ్లు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు తెలిపారు. కొత్తూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎం.శ్రావణికి శుక్రవారం ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రతి నెలా పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా హనుమత్ వ్రతం



ఆంజనేయస్వామికి సింధూర పూజ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం పూజలను విశేషంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి స్వామికి అభిషేకాలు జరిపారు. తదుపరి లక్ష తమలపాకుల పూజ, సింధూరపూజ, పట్టాభిషేక పారాయణాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందించారు. భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎస్‌డీజీపై రెండు రోజుల శిక్షణ

మాకవరపాలెం: సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డీజీ)పై రెండు రోజుల శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణకు పైన తెలిపిన వారంతా తప్పక హాజరు కావాలన్నారు.

'కార్పొరేటర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి'



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

సబ్బవరం: సచివాలయ ఉద్యోగులపై జీవీఎంసీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కౌన్సిల్ సమావేశంలో చేసిన అనుచిత వాఖ్యలపై సచివాలయ ఉద్యోగులు మండిపడ్డారు. సబ్బవరం మండల పరిషత్ ఆవరణలో మండలానికి చెందిన సచివాలయ ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉన్నత విద్యార్హతలున్నా, ప్రభుత్వ ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవ చేయగలమన్న మక్కువతోనే ఈ ఉద్యోగంలో చేరామన్నారు. విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు క్షేత్ర స్థాయిలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, కరోనా, వరదల వంటి విపత్కర సమయాల్లో తామందించిన సేవల్ని గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ, అన్ని విధాలా సేవలందిస్తున్న తమపై కౌన్సిల్లో సభ్యులు అమానుషంగా మాట్లాడటం సరికాదని, తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదలకు రగ్గుల పంపిణీ



గవరపాలెంలో పేదలకు రగ్గుల పంపిణీ చేస్తున్న వెంకటేష్ ఫ్యాన్స్

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెంలో సినీ నటుడు వెంకటేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వెంకటేష్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పి. చందు ఆధ్వర్యంలో పట్టణ వెంకటేష్ ఫ్యాన్స్ ప్రతినిధులు వెంకటేష్ జన్మదిన కేకు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పేదలకు రగ్గులను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు పి. చందు మాట్లాడుతూ పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న సూక్తిని నమ్మి ఏపీ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఐదేళ్లుగా బృందం సభ్యుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అభిమానులకు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నామన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ప్రోత్సాహకుడు శ్రీకాకుళం రాజు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పి.వి. జగన్ మోహనరావు, అభియాపేలే గాజువాక రాజు, లాయర్ శ్రీను, కొంగా నాగేశ్వరరావు, రోషన్‌కుమార్, రాయి వెంకటరమణ, సోమేష్, రాము, కిరణ్, లక్ష్మణ, నాగవరం శ్రీను పాల్గొన్నారు.

అనఘాదేవి సమేత దత్తాత్రేయ జయంతి నేడు



తేగాడలో వెలసి ఉన్న దత్తాత్రేయ స్వామి

కశింకోట: మండలంలోని తేగాడలో అనఘాదేవి సమేత దత్తాత్రేయ జయంతి ఉత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు గిరి ప్రదక్షిణ జరపడానికి సన్నాహాలు చేశారు. ఆలయం నుంచి పల్లకిలో అనఘాదేవి, దత్తాత్రేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను నిలిపి కోలాటాలతో ప్రారంభమై తేగాడ గ్రామం, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, బయ్యవరం గ్రామాల మీదుగా తిరిగి ఆలయం వరకు సుమారు పది కిలోమీటర్ల దూరం గిరి ప్రదక్షిణ జరగనుంది. ఆలయంలో హోమంతోపాటు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరపడానికి సన్నాహాలు చేశామని నిర్వాహకులు తెలిపారు.

పంచాయతీ దుకాణానికి రూ.8 వేల విద్యుత్ బిల్లు

లబోదిబోమంటున్న పారిశుధ్య కార్మికురాలు



దుకాణంలో నివాసం ఉంటున్న యర్రంశెట్టి సన్యాసమ్మ



జూలై, ఆగస్టు నెలలకు చెల్లించిన రూ.1,444 కరెంటు బిల్లు

కశింకోట: స్థానిక పంచాయతీ దుకాణానికి రూ.8 వేల విద్యుత్ బిల్లు చెల్లించాలని, లేదంటే మీటర్ తొలగిస్తామని అధికారులు బెదిరిస్తుండటంతో పారిశుధ్య కార్మికురాలు యర్రంశెట్టి సన్యాసమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. స్థానిక ప్రధాన రహదారిలోని పంచాయతీ దుకాణాన్ని ఏడాది చెల్లించే పన్ను ప్రాతిపదికన నరసమ్మకు సుమారు ఐదేళ్ల క్రితం ఇచ్చారు. నరసమ్మ ఇల్లు నిర్మించుకుంటుండటంతో రెండేళ్లగా పంచాయతీ దుకాణంలో కుటుంబ సభ్యులతో కలిసి తల దాచుకుంటోంది. ఆ దుకాణానికి ప్రతి నెలా ఐదారు వందలు మించి గతంలో విద్యుత్ బిల్లు వచ్చిన దాఖలాలు లేవు. ఈ ఏడాది చివరిగా జూలై, ఆగస్టు నెలలకు కలిపి రూ.1,444 బిల్లు చెల్లించారు. ఆ తర్వాత సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు కలిపి అదనంగా ఎటువంటి పరికరాల వినియోగం లేనప్పటికీ ఎప్పటిలాగు రావలసిన బిల్లు ఎక్కువగా రూ.1900 రావడంతో దాన్ని తగ్గించాలని చెల్లించలేదు. దీంతో గత నెలలో విద్యుత్ లైన్ కట్ చేశారు. అప్పటి నుంచి విద్యుత్ వినియోగం లేనప్పటికీ కనీస బిల్లుగా రూ.400తో కలిపి గడిచిన మూడు నెలలకు రూ.2,300 బిల్లు చెల్లించాల్సి ఉండగా, తాజాగా ఈ బిల్లుతోపాటు రూ.8 వేలు చెల్లించాలని, లేదంటే రీడింగ్ మీటర్ తొలగిస్తామని అధికారులు బెదిరిస్తున్నారని సన్యాసమ్మ వాపోతోంది. ఉన్నతాధికారులు కల్పించుకుని న్యాయం చేయాలని కోరుతోంది.